శంకరం పెళ్లి

ఎమ్. ఆర్. వి. కృష్ణరావుగారు.

టీ కప్పులు ముందరెట్టుకుని, సిగరెట్టు పీలుస్తూ 'పెళ్లి'ని గురించి ప్రస్తావిస్తున్నాం, రామూ, నేనూ.

* * *

'ప్రపంచంలో ఎక్కడైనా సరే, పెళ్లి రెండు రకాలు. మనలోవలె తలిదండ్రుల మారీభర్తున జరిగేవి ఓరకం. పాశ్చాత్యదేశాల్లో అమలులో వున్న వివిధతరగతి 'వూయింగు' వివాహాలు రెండోరకం. ఇందులో ఏరకానికి చెందంది మన శంకరం పెళ్లి' అన్నాడు రాము.

'ఏ శంకరం?'

'ఏరగవుటోయి. రిటైర్డు డిప్యూటీకలెక్టరు పంత్రంగి సుందరంగారి కొడుకు? బి. యే.లో మన క్లాసుమేటు కూడాను.'

'అవును. జ్ఞాపకం వొచ్చింది. విశాఖపట్నంలో తాటిపర్తి నరసింహంగారి అమ్మాయిని పెళ్లాడాడు కాదూ! ఏరకానికి చెందకపోవడమేం!'

'అయితే నీకు దాని వివరాలు పూర్తిగా తెలియవన్న మాట!'

'పూర్తిగా ఏమిటి, అసలు తెలియదు. కాని ఆ పెళ్లినిగురించి వింతగా చెప్పుకున్నారు అంతా. ఆ వివరాలు నీకు బాగా తెలిసేవుంటాయి విశాఖపట్నపు వాడివి.'

'నేను వాడు ధమ్మువిరా,లాకాలేజీలో క్లాసుమేటు కూడాను. పెళ్లిలోను చాలా చిత్రమైన పెళ్లిలే. చెపుతానువినుమరి. ఏరకమో నువ్వేనిర్ధారణచేసుకో.

* * *

౨

తాటిపర్తి నరసింహంగారు విశాఖపట్నంలో పెద్ద వకీలు. మహారాణిపేటలో బీచివొడ్డున మంచి మేడవుంది. శ్యామల ఆయన ఏకపుత్రిక. పన్నెండేళ్ల ప్రాయంలో పెళ్లిజేద్దామని సంబంధాలకోసం వెదికారు, ఇల్లరికంవుండే అల్లుణ్ణి సంపాయిద్దామని. పిల్లని చూడ్డానికొచ్చిన ఓ పెంకిబుఱ్ఱ అది విని 'మీ అమ్మాయికి ఎవర్నైనా కుంటివాణ్ణైనా, గుడ్డివాణ్ణైనా చేస్తే మీ యింట్లో వుంటాడు' అన్నాట్ట. ఆయనకి ఆమాటలతో కోపంవచ్చి 'మా అమ్మాయికి పెళ్లే చెయ్య''నని దీక్షతో చదివించేశాడు.

పదునాల్గేళ్లకే స్కూలుఫైనలు ప్యాసయింది. మంచి తెలివైందిలే. రూపమో! రవివర్మ బొమ్మే! యింటరుకి వాళ్ల పినతండ్రి దగ్గిరకి కాకినాడ వెళ్లి అక్కడ కాలేజీలో చదువుకుంది. ఆ రెండేళ్లు తలిదండ్రుల్ని వదిలివుండడం కొంచెం అలవాటయింది. 'అత్తారింటికి పంపిస్తే యిల్లాగేవుండును. పెళ్లిచేసివుంటే బాగుండును' అని విచారించి అప్పుడుకూడా ప్రయత్నించారు శ్యామలకి వివాహం చేద్దామని నరసింహంగారు — ప్రౌఢవివాహం. అనుకూలమైనది సంబంధం దొరకలేదు. శారదాబిల్లు అప్పటికింకా శాసనంకాలేదు. అమ్మాయి యింటరు ప్యాసయిందని తెలియగానే బి.యే. చదివించ నిశ్చయించారు. 'ఈలోపల శారదాబిల్లు శాసనం అవుతుంది. అప్పుడింత ప్రయత్నం అక్కర్లేకుండానే అవచ్చు వివాహం' అని శ్యామలని క్వీను మేరీసుకి పంపించారు, బి. యే.కి — మేం బి. యల్. లోకి వచ్చిన యేడన్న మాట.

మా పరీక్షలయిపోయి శలవులికి విశాఖపట్నం వచ్చేవరకూ శ్యామల పేరు వినడమేగాని, నేనైనా ఆమెను ఎప్పుడూ చూడలేదు. అంతవరకూ ఆవిడ పబ్లికు నోటీసులోకి (అనగా విద్యార్థుల దృష్టిలోకి తత్తుల్యమైన ఇతరుల దృష్టిలోకిన్నీ) రాలేదు. ఆ శెలవిలో బీచిపికార్లు చేస్తూంటే, ఫలానా అని తెలిసింది పైన వుదహరించినవారికి. అవి యూత్ లీగు రోజులు. అనగా దేశం అంతా యువజన సమితి వెఱ్ఱిలోపడిన రోజులన్న మాట. మా విశాఖ

553

పట్నంలోకూడా వొకటి ఏర్పాటుచేద్దామని కొందరు బయల్దేరి మీటింగుచేశారు. శ్యామలకూడా ఒక కన్వీనరు. ఆవేళ బాగాజ్ఞాపకంవుంది. ధాటీగా ధారాళంగా యింగ్లీషులో మాట్లాడేసరికి సభ్యులంతా ముగ్ధులై విన్నారు. ఆ వుపన్యాసంలో శ్యామల 'స్త్రీకి, తన జీవితంలో పురుషుడు తప్పనిసరియైనా పెళ్లి తప్పవచ్చు. కాబట్టి నా సోదరీమణులు, పెళ్లే ప్రధానంగా ఎంచుకోక దేశసేవకు ముందుకు రావాలి. సేవానిమగ్నులమైనరొదల వివాహం చేసుకోకుండానే శుద్ధమైన జీవితాన్ని గడపవొచ్చును' అని చెప్పింది. అప్పట్నుంచీ శ్యామల పేరు తెలియని విద్యార్థులుగాని, క్లబ్బు మెంబర్లుకాని విశాఖపట్నంలో లేరు. వాళ్ల సంభాషణలో ఎప్పుడో అప్పుడు ఆవిడ సంగతి రావలసిందే.

అప్రెంటిసు పరీక్షలయిపోగానే విశాఖపట్నం వొచ్చాం. శంకరం, వాళ్లనాన్నగారు రిటైరై ఆరోగ్యంకోసం విశాఖపట్నం వచ్చి మహారాణీపేటలో కాపురంవున్నారని చెప్పాడు. ఎక్కడున్నారో చెప్పు సాయంత్రం నే వొస్తానన్నాను స్టేషనునుంచి యింటికెడుతూ. లాటిపర్తి నరసింహంగారి యింటికెదురుగుండాను అన్నాడు.

'మంచి పొరుగే సంపాయించావురోయి!'

'ఏం? అల్లా అంటున్నావు?'

'ఏం, ఏమిట్రా! అదృష్టవంతుడవు! సముద్రంగాలే కాకుండా, స్త్రీగాలికూడా బాగా వేస్తుందిలే'

'ఎవరున్నారేంటి రా చుట్టుపక్కల?'

'వెళ్లవోయి! నీకే తెలుస్తుంది! కాని జాగ్రత్త సుమా!' అని నవ్వుతూ వెళ్లిపోయాను.

3

శంకరానికి పెళ్లిచేద్దామని వాని తల్లిదండ్రులకి అయిదేళ్లనుంచి సంకల్పం. 17వసంవత్సరంనుంచీ తమాషాగా ఎల్లాగో తప్పించుకుంటూ వచ్చాడు వచ్చిన సంబంధాలన్నీ చెదరగొట్టుతూ. ఒకపిల్లా నచ్చలేదనేవాడు. ఓపిల్లకి కళ్లు బాగుండలేదని, ఇంకో అమ్మాయి పొట్టిదని, ఓ లేమకి సంగీతంరాదని ఏవో లొట్లు ఎంచుతోండేవాడు తను మహాప్రపూర్ణుడైనట్టు. అందగాడు. లక్ష్మీపుత్రుడు. ఏంఅన్నా చెల్లింది. ఏకసుతుడవటంచేత బలవంతపెట్టలేకపోయారు సుందరంగారు నరసమ్మగారుకూడా.

విశాఖపట్నం వచ్చినవెంటనే, నేను అనకాపల్లి వెళ్లవలసివొచ్చింది. ఓవారం రోజులవరకూ అంచేత శంకరాన్ని కలుసుకోడానికి వీలులేకపోయింది. అనకాపల్లినుంచి రాగానే వాడింటికెళ్లాను. వీధిగదిలో కిటికీకెదురుగా కుర్చీ వేసుకు కూచున్నాడు. ఆమాటా, యీమాటా చెప్పుకుంటోండగానే 5-30 అయింది. 'షికారుపోదాం రా' అన్నాను. 'అరయిలేగాని రానురా' అని తదేక దృష్టితో కిటికీలోంచి చూస్తున్నాడు. నేను ఓపక్కగా కూచోవడంవల్ల, వాణ్ణి అంత మైమరువజేసిన దృశ్యమేదో నాకు గోచరించలేదు.

ఏమిటోయి అల్లా చూస్తున్నావు?

'ఒరే! రాము ఇల్లారా!'

'..........................'

'ఆ అమ్మాయిని ఎరుగుదువా?'

'ఆ! శ్యామలా! విశాఖపట్నంలో ఆవిణ్ణెరగనివాడెవ్వరా? వన్నెకెక్కిన వనితరా!'

'ఒరే రాము! నువ్వు ఇంత ఫూల్వి అనుకోలేదురా? కొంచెం కులాసాగా స్త్రీగావుంటే వెంటబడతారు..............'

'శంకరం!'

'ఎందుకు?'

'నాకేసిచూడు!'

'..................'

'తిన్నగా..............'

'ఎందుకోయి!'

నిట్టూర్పు విడువలేకుండా వుండలేకుండా పోయాను. చాలామంది 'ప్రేమ' అని వ్యవహరించేది ఒక జబ్బు. దాని చిహ్నాలు నిస్సంశయములు. దానితో బాధపడుతూన్న ప్రతివా[illegible] కళ్ళ వింతచూపు వస్తుంది. ఆచూపే శంకరం కళ్ళల్లోను

556

కనబడ్డది. సర్వం తేట తెల్లమయింది.

'శంకరం!'

'ఏం?'

'ఈమధ్యన పెళ్లికాకుండా కన్నె యువతీమణులు బయలుదేరారు తెలుసునా?'

'అయితే!'

'శ్యామల ఆబృందంలో చేరింది.'

'అయితే పెళ్ళాడదంటావా?'

'నిన్నే?'

'నాకేమిరా! ఏంలోటో చెప్పు!'

'నీకేంలోటుందనికాదు. ఎవర్నీ పెళ్ళాడదట. ఆ అమ్మాయి'

'చూద్దాంకాదూ!'

'ఏమిటి? ఆ అమ్మాయిని పెళ్లాడదామనే'!

'ఆ...'

'శంకరం నీకుసుఖంగా బ్రతుకుదామని లేదురా?'

'ప్రేమించిన యువతిని పెళ్ళాడకపోతే ఇక సుఖమెక్కడనుంచి వస్తుందిరా!'

'ఇంకెవ్వరూ దొరకలేదు నీకు?'

'ఇంకెవ్వరూనా! శ్యామలఏదో దైవవిధివల్ల ఇంత కాలం పెళ్ళవకుండానుందిగాని అటువంటి రూపవతి విద్యావతి, లావణ్యవతి, సుగుణఖని దేవకన్య...'

"ఆగు ఆగు...ఆగు...చాలు ఇంకవినలేను. అన్నీ నిజమేగాని, నీగతి ఏమవుతుందో తెలుసునా? ఆవిడ ప్లాటుఫారం అలంకరిస్తే నువ్వుపాయ్యలుకుతో పిల్లల్ని సముదాయించాలి?"

'ఇల్లాఅంటావంటే నీతో చెప్పకపొయ్యేవాడినే!'

'చెప్పావుగనుకనే నిన్ను ఆఆడుసింగంబంజా రెబ్బనుంచి తప్పిద్దామని ప్రయత్నిస్తున్నాను. శంకరం! నామాటవిను స్త్రీలకు వోటింగు హక్కుకూడా వస్తే శ్యామల తప్పకుండా మినిష్టరవుతుంది. అపుడు నువ్వు ఏమవుతావో తెలుసునా? మిస్టర్ శ్యామలా?'

'ఏడిశావులెద్దు. ఎంత సింగాన్నస్నా, మూడురోజుల్లో మచ్చిక చేస్తానురా?'

'నీ మొహం! నువ్వా! మొన్న ఇంటరుక్లాసు తలుపుదగ్గిర కొందరు ఆడపిల్లలు అడ్డంగా నుంచుంటే వెళ్లి మొహం చేసుకు నే వొచ్చిందాకా ట్రంకుచేత పట్టుకు నుంచున్నవాడివి నువ్వా? శ్యామలని మచ్చిక చేసేది?'

'ఒరే! నీతో ఇంక నే జేం చెప్పను. పెళ్ళికి నిన్ను పిలవడం!'

'నిన్ను ఆవిడ పెళ్ళాడాలిగాదుటోయి!'

౪

శంకరం యింట్లో నాకు చాలా చనువు. మేం బి. యే. రాజమండ్రీలో చదువుతోన్నప్పుడు సుందరం గారు అక్కడే వుండేవారు. తరుచు వాళ్ళింటికి దుతో చాలా చనువుగా వుండేవాణ్ణి.

మే నెల మొదటివారంలో ఒకసారి వాళ్ళింటి కెళ్ళాను. శంకరం ఇంట్లోలేడు. నరసమ్మగార్ని 'ఎక్కడికెళ్ళా'డని అడిగాను.

'నరసింహంగారి యింటికి'

"ఎంతసేపయిందండి?"

'ఒకగంట అవుతుంది!'

'పిన్నిగారూ......'

'...................'

"మీ అబ్బాయి వివాహం ఏమన్నా నిశ్చయించారాండి?"

"లేదు, నీ ఎరికలో ఏమైనా మంచి సంబంధాలున్నాయేమిటి?"

'లేవండి మొన్న మీవాడు నాతో నరసింహం గాని అమ్మాయిని......'

'నేనూ అదే కోరుతున్నాను. పెద్దపిల్లయితే అయింది. ఏవంకరా లేదు. ఎవరో ఒకర్ని పెళ్ళాడితే చూసి సంతోషిద్దామని వుంది.'

ఈమాటలువిని నిజంగా దిగ్భ్రమచెందానంటే నమ్మరే! మూడేళ్ళకిందట ప్రౌఢవివాహం అంటే మండిపడిపోయారు నరసమ్మగారు. శారదాబిల్లుని, దాన్ని ఆమోదించిన వారిని చెడతిట్టారు. అల్లాంటి స్త్రీ నేడు తన కొడుకు ప్రౌఢవివాహం చేసుకుంటా

557

నంటే కుతూహలం పడడం కాలమహిమే. మానవ జీవితంలో శంకరం, శ్యామలలాంటి తనయులు అపూర్వశక్తుల అనిచెప్పాలి. వారు సాధారణంగా తలిదండ్రుల జీవితంలో అపురూపమైన మార్పులు కలుగజేస్తూంటారు.

'ఆ అమ్మాయిని మీరు ఎరుగుదురాండీ?'

'ఎరక్కేమి? మేంయిదివరకు యీ వూళ్ళోవున్నప్పుడు కాంతమ్మగారింట్లో నే వుండేవాళ్ళం. ఈ మేడ ఈమధ్యన కొనుక్కున్నారు. గాని, వీరు పూర్వం వూళ్లోవుండేవారు. శ్యామల మంచిబుద్ధి మంతురాలు. అంతచదువుకున్నా గర్వం ఎక్కడా లేదు.'

ఇక లాభంలేదనుకుని 'శంకరంతో నే వొచ్చానని చెప్పం'డని వెళ్ళిపోయాను.

*

వచ్చిన నాలుగురోజులలో నే నరసమ్మ, కాంతమ్మగార్లు తమపూర్వ పరిచయానికి మెరుగుపెట్టారు. తరుచు వీరింటికివారు, వారింటికి వీరువచ్చి పోతూ వియ్యమందితేచాలాబాగుంటుందని వొప్పుకున్నారు. కాంతమ్మగారు ఒకరోజున శంకరంతో 'నాయినా మేం ఎన్ని చెప్పినా మామాట వినదు. పెళ్ళొక్కట్లే దంటుంది. నువ్వేమైనా వొప్పించకలుగుదువేమో చూడు' అని శంకరంతో అందిట. మరునాటి సాయంత్రం నరసింహంగారు శంకరాన్ని, టీకిపిల్చి, శ్యామల్ని ఎరుకపరచారు. దొరికిందిగదాఅదను అని మనవాడు ఆనాటినుంచే వూయింగు మొందలెట్టాడు. అదోచక్కని గాధ.

రెండోరోజున సాయంత్రం శంకరం శ్యామల యింటికివెడితే కాంతమ్మగారు మేడమీదవుంది వెళ్ళమందిట. శంకరం మందహాసవదనంతో మెట్లు పిల్లిలా పైకెక్కి తలుపుకొంచెం వొత్తిగించిచూశాడు. శ్యామల కుర్చీమీదపడుకుని చదువుకుంటూంది. కాళ్ళదగ్గర చక్కని కుక్కొకటి కూచుంది. శంకరం మెల్లిగా లోపలికివెళ్లి 'నేను మీ చదువుకు భంగం కలుగజెయ్యడం లేదుగద!' అన్నాడు గద్గదంగా.

శ్యామల తలపైకెత్తి 'లేదురండి.' అని కుర్చీచూపించింది.

'ఇవ్వాళ ఎండ చాలా తీవ్రంగావుంది.'

'ఊఁ'.........అని శంకరాన్ని ఒకసారిపరికించి మళ్ళీ చదువు ప్రారంభించింది శ్యామల.

'నే వెడతాను. చదువుకు భంగం కలుగజేస్తున్నానుకాబోలు' అన్నాడు రెండునిముషాలు కూచుని, సంభాషణ ముందుకు సాగకపోతే శంకరం.

'నేనూ వస్తున్నానుకిందకి. టీతాగివెడుదురుగాని' అని లేచి షెల్ఫుమీద కుక్కబిస్కట్లు రెండు తీసి మెట్లు దగ్గరకి పయనమయింది, కుక్కా, శంకరం వెంబడించగా. మెట్లదగ్గరకుక్క, శ్యామల చేతిలో బిస్కటు అందుకుందామని ఎగిరేసరికి 'హాయి'మని కసిరింది. ఆకసరుతో తోకవేలేసి శంకరంకేసి చూసింది శునకరాజం. శంకరం దానికేసిచూశాడు. మారుమాటాడకుండా ఇద్దరు శ్యామల వెనకాలమెట్లు దిగారు. శంకరం వూయింగులో ప్రథమాంకమిక ఇల్లా ముగిసింది.

తరువాత రోజూ వెడుతూండే వాడు నరసింహంగారింటికి శంకరం. శ్యామల్ని ఎంత అర్థంచేసుకుందామని ప్రయత్నించినా కొలుకువడ్డది కాదు. ఆమె నడత వినువుకి, కోపానికి తావిచ్చినా, అశాకడమిచ్చేది. మొత్తంమీద ప్రేయసులుపడే బాధలన్నీ పడుతూ దినమొక యుగంగా గడుపుతున్నాడు రోజులు శంకరం.

ఒకరోజున శ్యామలస్నేహితురాలు శంకరాన్ని చూపించి 'ఆయనెవరు! మీయింటికి రోజూవస్తూంటారు' అని అడిగిందిట. శ్యామల 'ఆయన మాయింటికెదురుగుండా కాపురమున్నారు. కుక్కలంటే చాలా సరదా. మా 'టామీ'తోను 'గ్రీటా' తోను ఆడుకోడానికి రోజూవస్తూంటారు' అని శంకరం వింటూండగా చెప్పిందట. మరునాడు వాళ్లింటికెళ్లకుండా మాయింటికొచ్చి, శంకరం నాకీసంగతి చెప్పాడు.

558

ఇకనైనా బుద్ధితెచ్చుకు పెళ్ళిచేసేపాలు మానెయ్యమన్నాను. లేపు వాళ్ళింటికెడితే వోట్టన్నాడు. తరువాత రెండురోజులుతప్పకుండామాయింటికొచ్చాడు. మూడోరోజున మాయమయ్యాడు. పిమ్మటిదినం నేవెళ్లి మళ్ళీ ఏంజరిగిందని అడిగాను. "నిన్న శ్యామల మా యింటికొచ్చి, 'ఏమండీ రావటంలేదు? రెండురోజులనుంచి! వంట్లోనుస్తిగానుందేమో అనుకున్నాను సినీమాకి వెడదామా?' అని అడిగింది. ఒరే దానినడత నాకేమి అర్థంకావటంలే"దన్నాడు.

'స్త్రీజాతేమాయ. స్త్రీనిపురుషుడెన్నడూ పూర్తిగాఅర్థంచేసుకోలేడు. అందులో ఆంగ్లవిద్యాగంధం కల్గిన ఆంధ్రస్త్రీ అసలే అర్థంకాదు. వాళ్లు స్టేజిమీద శకుంతలలయినా, దైనికజీవితంలో మట్టుకు అద్భుతంగా, నటిస్తారు. ఏం చెప్పమన్నావు? ఆచిక్కు నువ్వే విప్పుకోవాలి' అన్నాను.

ఇంతలోకి వార్తాపత్రిక వచ్చింది. శంకరం అదుర్దాగా విప్పాడు, మద్రాసు విశ్వవిద్యాలయంవారి బి. యే. డిగ్రీ పరీక్షాఫలితాలుకోసం.

గబగబా, ఎగాదిగాచూసి ఫిలాసఫీ ఫస్టుక్లాసు, ఇంగ్లీషు సెకండుక్లాసన్నాడు.

'ఎవరు'

'శ్యామల'

ఆవార్తతో శ్యామల అందని మ్రానిపండయిందని సంతోషిస్తున్నాను.

* * *

'అబ్బాయి శంకరం! మా అమ్మాయి ఫస్టుగా ప్యాసయిందిట. నువ్వీవాళ మాయింటికి భోజనానికి రావాలి' అని కాంతమ్మగారు చేతెడు మొగంతో పట్టలేని సంభ్రమంతో శంకరంతో చెప్పింది. మళ్ళీ నా ఆశలు క్రుంగిపోయాయి. ఇంటికెడతా నని వచ్చేశాను.

౬

శంకరం శ్యామల ప్యాసయిందని తెలుసుకుని మొదట సంతోషించినా తరువాత కొంత దిగులుచెందకపోలేదు. పరీక్షపోయివుంటే తనువెళ్లి పోదార్చడాని కవకాశంకలిగేది. సెప్టెంబరు పరీక్షకు అవసరంఅయితే (తప్పకుండాకలిగివుండునని వాడినమ్మకం) తను సహాయంచేసేవాడు. విధివశాన్ని సణుగుకొని లాభంలేదని గ్రహించి సాయంత్రం శ్యామలింటికివెళ్ళాడు. ఆవేళ ఏదో సందర్భంచేసుకు తనహృదయంలో ఇన్నాళ్లనుంచీ అణచిపెట్టుకున్న కోరికని వెలిబుచ్చుదామనుకున్నాడు. శ్యామల డాబామీద పుస్తకం చదువుతూంది. టామీ, గ్రేటా కుర్చీదగ్గిర పడుకున్నాయి. శంకరం కుర్చీదగ్గిరకుచేరి అభివందనములు అన్నాడు.

'థాంక్సు',

'ఏమిటో చదువుతున్నారు! అంతా ప్రేమనుగురించిలావుంది!'

శ్యామల తల పైకెత్తకుండానే చిరునవ్వునవ్వింది.

'ఇవ్వాళ చెడఎండకాసింది. సాయంత్రం ఈగాలి లేకపోతే చాలా బాధపడుదుం.'

'ఊ' తల పైకెత్తకుండా.

శంకరం కొంచెం నొచ్చుకున్నాడు. దూరంగా ఇంకోకుర్చీవుంది, అక్కడకెళ్లి దాన్లో కూచున్నాడుచాలాసేపు. శ్యామల క్రీగంట కనిపెడుతూనేవుంది. 7-30 అయింది. శంకరంవచ్చి అరగంటవుతుంది. మళ్ళీ ఎవరూ మాట్లాడలేదు.

'టామీ!'

శంకరం ఆరువారాలలోను టామీకి ఆప్తబంధువయ్యాడు. అది తోకాడించుకుంటూ వాడిదగ్గిరకెళ్లింది.

'గ్రేటా!'

రాలేదు.

టామీకూడా గ్రేటాకేసిచూసింది. రమ్మనట్టు అరిచింది. గ్రేటారాలేదు. శంకరంకేసి దీనంగాచూచింది.

'జాతిలక్షణం' అన్నాడు టామీతో శంకరం. తరువాత బుజ్జగిస్తూ 'టామీ, గ్రేటాకు సహృదయం లేదు. దానిదగ్గిర కెళ్లకింక'!

కిలకిలమని నవ్వింది శ్యామల.

'టామీ! కొందరు మానవులకే లేదే హృదయం.'

'హృదయముండని వారుంటారా?' అందిశ్యామల నవ్వుతూ,తలపైకెత్తి.

'కొందరికివుండే ప్రయోజనముండదు. అది ఆకాశపుష్పం, అందరాని చందమామ.'

'ఊహూ!'

'సహారా ఎడారి..........'

'సహారా ఎడారి కూడా ఒకప్పుడు జలధిలో ఒక భాగం అని భూగోళశాస్త్రజ్ఞులంటారు.—'

'అమ్మా వంట అయిందిట, అబ్బాయిగార్ని, మిమ్మల్ని భోజనానికి లెమ్మన్నారండి.'

'భోజనానికి లేవచ్చువండి.'

'నా కివ్వాళ ఆకలిగా లేదు.—ఆ పున్నమచంద్రుణ్ణి సముద్రాన్ని చూచి ఆనందిస్తూ ఇక్కడే ఉండాలనివుంది.'

'వుండండి. నాకు ఆకలేస్తూంది' అని ఛంగున మెట్లుదిగి కుక్కని వెంటబెట్టుకు వెళ్ళిపోయింది. టామీకూడా వెంటబడ్డది.

పిట్టగోడమీద మోచేతినిపెట్టి గడ్డంక్రింద చెయ్యి వానుకుని, కొంచెంవంగి శూన్యంలోకి చూస్తూ హిమకరుని దూరుతూనిలబడ్డాడు శంకరం. క్రిందనుంచి కమ్మనివాసనలు వస్తున్నాయి. సాయంత్రంతాగింది రెండుకప్పుల టీ అయినా, మండువేసగిలో రాత్రి ఎనిమిదింటికి ఎవరి కాకలెయ్యదు? కమ్మతావుల నాఘ్రాణించిన ఎవరికోరూరదు?

వంటవాడువచ్చి 'అయ్యా భోజనానికి రమ్మంటున్నారండి అమ్మగారు, అని పిలిచాడు. వెడదామనే వుంది. కాని అభిమానం. శ్యామలచూపుతూపులు, ఎదసక్కం ఓర్వాలి. 'రా'నన్నాడు. ఒకవంక జఠరాగ్ని వేరొకవంక ప్రణయజ్వాల దహిస్తున్నాయి. దీర్ఘనిశ్వాసం ఒకటి విడిచాడు......బుజంమీద ఎవరో చెయ్యివేశారు. ఎవరా అని చెయ్యివేసేసరికి చల్లగా జిల్లుగా తగిలింది. వెనుతిరిగాడు. పూర్ణచంద్రుణ్ణి అపహసిస్తూన్న మందహాసంతో వెలుగొందుతోంది శ్యామలవదనం. కొన్నివేల సంవత్సరాల నుంచీ అదిమిపెట్టబడి ఒక్కక్షణంలో భూగర్భంలోంచి పైకు బికే అగ్నిశిఖలాగ వాడిలోంచి బయల్వెరింది ఆవేశం. ఆ సుందరవిగ్రహాన్ని తనబాహులతలలో పెనవైచి పెదవులు ముద్దెట్టుకున్నాడు.

తొణకలేదు, బెణకలేదు, దృఢంగాను, నెమ్మదిగాను కౌగిలి సడలించుకుని 'చంద్రుణ్ణి సముద్రాన్ని చూసి కావలిసినంత సేపు ఆనందించొచ్చు. నేనూవస్తాను—భోజనంచేసిన తరువాత.'

....

మరునాడు నేసేయిచ్చాను శుభలేఖ అచ్చుకి. ఏరకంపెళ్ళో నువ్వేచెప్పాలి.

ఎవతె ధన్యురాలు

కొమ్మనమంచి జోగయ్యశర్మగారు

సీ॥ మాటమాటకుఁ దేనె లూటలూరుచునుండు ముద్దుబిడ్డలతోడ మురయునెవతె,
తమపురోవృద్ధికై దగు విద్యలన్బొందు ననుఁగుకొమరులతో నలరునెవతె
చిలుకగోర్వంకల చెలువుంపుకూతులల్లుండ్రచే మిన్నందుచుండునెవతె
పసుపుఁబారాణి క్రొంబసలీనుమైచాయ నిత్యకళ్యాణియై నెగడునెవతె
తే॥గీ॥ పూవునెత్తావిగూడినపోల్కి, తరణిఛాయయు నీడబాయనిబాయ, ననయ
మాత్మధవునానుకూల్యంబు నందునెవతె యామెపో ధన్యురాలు ఈయుర్వియందు.